బేస్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

బేస్‌బాల్ జిల్లా జట్టు సభ్యులతో ప్రిన్సిపాల్ నళిని, బేస్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు

డిచ్‌పల్లి, డిసెంబర్ 4: సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో నిజామాబాద్ సీనియర్ మహిళల బేస్‌బాల్ జిల్లా జట్టు ఎంపికలను పాఠశాల ప్రిన్సిపాల్ తీగుళ్ల నళిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బేస్‌బాల్ జిల్లా జట్టును రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలుపాలని అన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఆరో తేదీ వరకు శిక్షణ ఇచ్చి తుది జట్టును ఎంపిక చేస్తామని చెప్పారు. బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎల్.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, పీఈటీలు జ్యోత్స్న, శ్రీలత, కోచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ర్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్న నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

డిచ్‌పల్లి, డిసెంబర్ 4: ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో యాంటీ ర్యాగింగ్‌పై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ర్యాగింగ్ పేరుతో సీనియర్లు జూనియర్ విద్యార్థులను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తే నేరంగా పరిగణిస్తామన్నారు. ర్యాగింగ్ పేరుతో క్షణికావేశంలో తప్పటడుగు వేసి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. ర్యాగింగ్ బారిన పడి ఎవరైనా విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే అందుకు కారణమైన వారికి పదేండ్లు జైలుశిక్ష విధించే అవకాశం ఉంటుందన్నారు. ర్యాగింగ్ చేసినట్లు నిర్ధారణ అయితే విద్యా సంస్థల నుంచి తొలగిస్తారని తెలిపారు. తోటి విద్యార్థులతో సోదర భావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో టీయూ యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కే.రవీందర్‌రెడ్డి, ఆడిట్ సెల్ డైరక్టర్ ఘంటా చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య, సీఐ మల్లేశ్, ఎస్సై ఎండీ షరీఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి అంబులెన్స్ నడిపిన డ్రైవర్‌కు మూడు రోజుల జైలు శిక్ష

వినాయక్‌నగర్, డిసెంబర్ 4: నిజామాబాద్ నగరంలో మద్యం తాగి అంబులెన్స్ నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన డ్రైవర్‌కు మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అహ్మద్ మొయిద్దీన్ బుధవారం తీర్పు వెలువరించారని ట్రాఫిక్ సీఐ పి.ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 2వ తేదీన ట్రాఫిక్ పోలీసులు హైదరాబాద్ రోడ్డులో తనిఖీ చేస్తుండగా.. అంబులెన్స్ నడుపుకుంటూ వచ్చిన మహమ్మద్ ఇసాక్‌కు బ్రీచ్ అనలైజర్‌తో పరీక్షించగా మద్యం తాగి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో డ్రైవర్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి, బుధవారం కోర్టులో హాజరుపర్చడంతో నిందితునికి 3 రోజుల జైలు శిక్ష విధించారని సీఐ తెలిపారు.

న్యూసెన్స్ కేసులో మరొకరికి ఏడు రోజులు..

వినాయక్‌నగర్, డిసెంబర్ 4: మద్యం మత్తులో న్యూసెన్స్ సృష్టించిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అహ్మద్ మొయిద్దీన్ ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బోర్గం (పీ) గ్రామానికి చెందిన శ్రీధర్ మద్యం సేవించి కుటుంబీకులతోపాటు చుట్టుపక్కల ఇండ్ల వారికి ఇబ్బంది కలిగించేవాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్రీధర్‌పై కేసు నమోదు చేసి, బుధవారం కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారించిన మెజిస్ట్రేట్ నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్సై తెలిపారు.

హోటల్ నిర్వాహకుడికి ఒక రోజు..

వినాయక్‌నగర్, డిసెంబర్ 4: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఈనెల 2వ తేదీన రాత్రి పదిన్నర గంటల అనంతరం హోటల్‌ను తెరిచి ఉంచిన షేక్ గౌస్ పాషాపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. అతడిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా.. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అహ్మద్ మొయిద్దీన్ నిందితుడికి ఒక రోజు జైలు శిక్ష విధించాడన్నారు. నిందితుడిని జైలుకు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి ఐదు నెలలు..

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 4: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన కోనేటి నరేశ్ అనే వ్యక్తికి దొంగతనం కేసులో ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఐదు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే జక్రాన్‌పల్లి తండాలో ఆగస్టులో బానావత్ నరేశ్ ఇంట్లో కోనేటి నరేశ్ దొంగతనానికి పాల్పడ్డాడు. అతడిని కోర్టులో హాజరుపర్చగా ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి నిందితుడికి ఐదు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

14 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు

వినాయక్‌నగర్, డిసెంబర్ 4: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ పి.ప్రసాద్ తెలిపారు. వారిని బుధవారం కోర్టులో హాజరు పర్చామన్నారు. వారందరికీ రూ.38వేల జరిమానా విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారని సీఐ ప్రసాద్ వెల్లడించారు.

గజ్జెలమ్మ ఉత్సవాలు సంపూర్ణం

రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రుద్రూర్, డిసెంబర్ 4: మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో నిర్వహిస్తున్న గజ్జెలమ్మ ఉత్సవాలు బుధవారం పరిపూర్ణమయ్యాయి. ప్రతి సంవత్సరం రెండు రోజులపాటు గ్రామస్తులు గజ్జెలమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. చివరి రోజు పోతురాజుల విన్యాసాలతో రథం ఊరేగింపు, జాతర కొనసాగాయి. గ్రామ పెద్దలు పట్టెపు రాములు, రెంజర్ల గంగారాం, శానం హన్మాండ్లు, మంత్రి గంగారాం పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే దేశరక్షణ

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందూ ఐక్యవేదిక బాధ్యులు

సుభాష్‌నగర్, డిసెంబర్ 4: ఐకమత్యంతోనే దేశ రక్షణ సాధ్యమని, బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రతినిధి గుమ్మాల సత్యం అన్నారు. జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంగ్లా హిందువుల సంఘీభావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులందరూ సంఘటితం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రతినిధి గురుచరణ్, మల్లారం పిట్ల కృష్ణ మహరాజ్, ఇస్కాన్ బాధ్యుడు రామనందరాయ్ ప్రభు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ఠాకుర్ తదితరులు బంగ్లాదేశ్‌లో హిందూవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ధాత్రిక రమేశ్, శ్రీకాంత్, శ్రవణ్, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సుద్దపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, డిసెంబర్ 4: మండలంలోని సుద్దపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శంకుస్థాపనలు, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి సర్వీస్ రోడ్డు నిర్మించేలా కృషి చేస్తానని చెప్పారు. మండలం త్వరలో ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుతుందని తెలిపారు. ఎన్‌హెచ్-44 నుంచి లింగసముద్రం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానన్నారు. అంతకు ముందు ఎస్సీ కమ్యూనిటీ భవనం, సీసీ రోడ్డు, ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. లైబ్రరీలో చదివి ఉద్యోగాలు సాధించిన 13మందిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, మోత్కూరి నవీన్ గౌడ్, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, చిన్నోల్ల నర్సయ్య, సొసైటీ చైర్మన్లు చింత రామకృష్ణ, గంగారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు పౌరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భూకంపం వచ్చిందంటూ వదంతులు

భీమ్‌గల్,డిసెంబర్4: మండలంలోని పలు గ్రామాల్లో భూకంపం వచ్చినట్లు బుధవారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో వదంతులు చక్కర్లు కొట్టాయి. ప్రజలు అయోమయంలో పడ్డారు. కొంత మంది ఆకతాయిలు తమ ఊర్లో భూకంపం వచ్చిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ విషయంపై తహసీల్దార్ షబ్బీర్‌ను వివరణ కోరగా అలాంటిది ఏమీ తమ దృష్టికి రాలేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని అన్నారు.

యువకుల రక్తదానం

ముప్కాల్, డిసెంబర్ 4: మండల కేంద్రంలో బుధవారం స్థానిక పూసవర్ల సంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని యువకులు రక్తదానం చేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

రెంజల్, డిసెంబర్ 4: నిజామాబాద్ వరల్డ్ ఆర్గనైజర్ సహకారంతో నీలా జడ్పీ ఉన్నత పాఠశాలలోని 365 మంది విద్యార్థులకు బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 40 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. ఫీల్డ్ కోఆర్డినేటర్ వినోద్, ప్రతినిధి రజిత, సమీర్, హెచ్ఎం ఇల్తేపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి ప్రభుత్వ దవాఖానలో సమస్యల తిష్ట

దవాఖానలో వైద్యులతో మాట్లాడుతున్న నాయకులు

ధర్పల్లి, డిసెంబర్ 4: ధర్పల్లి ప్రభుత్వ దవాఖానలో సమస్యలు తిష్టవేశాయని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.గోదావరి, డివిజన్ అధ్యక్షురాలు రమ అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానలో వసతులు, వైద్యం, రోగుల పరిస్థితులపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు వారు ధర్పల్లి దవాఖానను బుధవారం సందర్శించారు. ప్రభుత్వ దవాఖానలో సరైన వసతులు లేకపోవడంతో దవాఖానకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వసతులు, సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనీశ్, దామోదర్, బాబన్న, సాయారెడ్డి, సత్తెవ్వ, పుష్పలత, జమున, లావణ్య పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

డిచ్‌పల్లి, డిసెంబర్ 4: వరంగల్ జిల్లాలో డిసెంబర్ 1న నిర్వహించిన 2వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో డిచ్‌పల్లి ఆదర్శ కళాశాలకు చెందిన వినీత తృతీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ డాక్టర్ దశరథ్ బుధవారం తెలిపారు. దీంతో ఆమెను ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ సంజీవ్, కోచ్ బిందు, ఉపాధ్యాయులు అశోక్, మహేశ్, రాణి, శ్రీనిజ, సుష్మ, కుల్‌దీప్, గంగప్రసాద్, చిత్ర తదితరులు అభినందించారు.

ఆటోల బంద్ జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి

రుద్రూర్, డిసెంబర్ 4: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ కోరారు. కేంద్ర బీజేపి ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలని, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ ఏడాదికి రూ.15 వేలు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఖలీం, ఫక్రూ, అంజయ్య, సతీశ్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి దత్త జయంతి వేడుకలు

సుభాష్‌నగర్, డిసెంబర్ 4: శ్రీ దత్త జయంతి ఉత్సవాలను ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు మల్లారం శ్రీదత్త నిర్మల ఆశ్రమాలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు గురుస్వామి సాంబయ్య శాస్త్రి బుధవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 9న అభిషేకం, 10న దత్తగాయత్రీ కోటి జప యజ్ఞం, 11న మహాహారతి, 12న అభిషేకం, 13న ప్రదోషకాల పూజా, 14న భారతీ తీర్థ పురస్కార గ్రహీత శ్రీనివాస బంగారయ్యశర్మ ధార్మిక ప్రసంగం, 15న దత్తజయంతి వేడుకలు డోలారోహణం, గరికపాటి గురుజాడ గారితో దత్త జన్మ వృత్తాంత ప్రవచనం, 16న గురుచరిత్ర గ్రంథ పూజా తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్, డిసెంబర్ 4: బోధన్ పట్టణం ఆచన్‌పల్లికి సమీపంలో పెగడపల్లి రోడ్డులో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఆచన్‌పల్లి, పెగడపల్లి రోడ్డు వద్ద విద్యుత్ సరఫరా సరిగా ఉండడం లేదన్న స్థానికుల ఫిర్యాదు మేరకు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం అవసరమని ఎమ్మెల్యే భావించారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులతో వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ట్రాన్స్‌కో డీఈ తోట లింగం, బోధన్ తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సాంబిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు టి.ఇంద్రకరణ్, తూము శరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

బోధన్ రూరల్,డిసెంబర్ 4: మండలంలోని రాజీవ్‌నగర్ తండా గ్రామంలో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్, తపస్వి రామారావ్ మహరాజ్ విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కిచెన్‌గార్డెన్‌లో పండిన పండ్ల పంపిణీ

పండ్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

వేల్పూర్, డిసెంబర్ 4: అంక్సాపూర్ పాఠశాలలోని కిచెన్ గార్డెన్‌లో జూలైలో నాటిన అరటి, జామ, బొప్పాయి మొక్కలు పెరిగి కాయలు కాశాయి. అరటి పండ్లను బుధవారం విద్యార్థులందరికీ హెచ్ఎం రాజేందర్‌గౌడ్ పంపిణీ చేశారు. మండలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసిన మొదటి పాఠశాల ఎంపీపీఎస్ అంక్సాపూర్ అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగామణి, స్నేహలత, సంధ్యరాణి, మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాధన సర్వే పరీక్ష

బాల్కొండ, డిసెంబర్ 4: అభ్యాసన సామర్థ్యాలు అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ సాధన సర్వే (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షను బుధవారం నిర్వహించింది. బాల్కొండ జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి విద్యార్థులు, సెయింట్ ఈఏఎస్ ఎయిడెడ్ పాఠశాలలో 3, 6వ తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా జాతీయస్థాయిలో 3, 6, 9వ తరగతుల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను అంచనా వేయనున్నారు. మూడో తరగతి గణితం, ఈవీఎస్, ఆంగ్లం, తెలుగు, 6వ తరగతి విద్యార్థులకు గణితం, ఆంగ్లం, ఈవీఎస్, తెలుగు, 9వ తరగతి విద్యార్థులకు సామాన్య, సాంఘిక, తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించామని ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

వారంలో పనులు పూర్తిచేయాలి

మోర్తాడ్, డిసెంబర్ 4: మండలంలోని నర్సరీల్లో బ్యాగు ఫిల్లింగ్ పనులను వారం రోజుల్లో పూర్తిచేయాలని ఎంపీడీవో రాజశ్రీ నివాస్, ఏపీవో విద్యానంద్ అన్నారు. కమ్మర్‌పల్లి మండల పరిషత్‌కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుంటుంబానికి ఆర్థిక సాయం

ముప్కాల్, డిసెంబర్ 4: మండల కేంద్రానికి చెందన బొల్లి సన్నీ(21) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా నిషిత గ్రూప్ ఇండస్ట్రీస్ చైర్మన్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ బాధిత కుటుంబానికి రూ.ఐదు వేలు బుధవారం అందజేశారు. గ్రామ పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ థామస్, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ముప్కాల్, డిసెంబర్4: స్థానిక గ్రామ సమస్యలపై ఎంపీడీవో నరేశ్ ఆనంద్‌కు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పరిరక్షణ సమితి సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ పలు సమస్యలను అధికారులకు వివరించారు. గ్రామ పంచాయతీకి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

రెంజల్, డిసెంబర్ 4: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న బుధవారం తెలిపారు. బోధన్ మండలం కొప్పర్గా నుంచి ఇసుక లోడ్‌తో నీలా వైపునుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న టిప్పర్‌ను నీలా వద్ద తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి జరిమానా కోసం మైన్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

విజయవంతం చేయాలి

రెంజల్, డిసెంబర్ 4: తెలంగాణ రాష్ట్రంలో ఆటో, టాక్సీ, క్యాబ్, డ్రైవర్ల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 7న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు సంబంధించిన పోస్టర్లను మండలంలోని నీలా గ్రామంలో ఏఐపీకేఎంఎస్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. బోధన్ డివిజన్ నాయకులు ఇర్షాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ లను నెరవేర్చడం లేదని అన్నారు. బంద్‌లో ఆటో ట్యాక్సీ డ్రైవర్లు భారీ సంఖ్యలో చేరుకొని ప్రభుత్వం కదిలిరావాలని జిల్లా నాయకుడు షేక్ నసీర్ కోరారు. రాష్ట్ర బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు.

పాఠశాలకు విరాళం

బోధన్ రూరల్, డిసెంబర్ 4: సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుకు ఐలవ్ మై విలేజ్ ఫౌండర్ నాగేంద్ర (యూఎస్ఏ) రూ.25 వేల విరాళం అందజేశారు. ఐలవ్ మై విలేజ్ సంస్థ కోఆర్డినేటర్ ప్రభావతి బుధవా హెడ్ మాస్టర్ ధనరాజ్‌కు రూ.25 వేలను అందజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు

నవీపేట,డిసెంబర్ 4: మండలంలోని యంచ జగధాత్రి దేవి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బ్రహ్మోత్సవాల పోస్టర్లను బుధవారం ఆలయ వ్యవస్థాపకురాలు స్వర్ణ కమల లక్ష్మితో కలిసి జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆవిష్కరించారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లను చేస్తోందని వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్.పృథ్వీరాజ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయ్యప్ప పడిపూజ

నవీపేట, డిసెంబర్ 4: నందిగామలో అయ్యప్ప పడిపూజ బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ లావణ్య కిషన్‌రావు ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. స్వాములకు పెద్ద ఎత్తున భిక్ష ప్రసాదంగా ఇచ్చారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.రాంకిషన్‌రావు, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నాయకులు ఆర్.పృథ్వీరాజ్, పలు గ్రామాల అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల చోరీ

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్4: పట్టణ శివారులోని పంట పొలాల్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు కేబుల్ వైర్లను దొంగిలించారని బాధిత రైతులు బుధవారం తెలిపారు. తరుచూ మోటర్ల కేబుల్ వైర్లు, ప్యూజులను ఎత్తుకెళ్తుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు

మోర్తాడ్, డిసెంబర్ 4: 2024-25 సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి డిసెంబర్ 11వతేదీ వరకు అవకాశం ఉందని కమ్మర్‌పల్లి ఉన్నతపాఠశాల హెచ్ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సాయన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఆలూర్,డిసెంబర్4: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో నరేందర్ బుధవారం పరిశీలించారు. వంట గదిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. వంట చేసే వారు పరిశుభ్రత పాటించాలని చెప్పారు.

చర్యలు తీసుకోవాలి

బోధన్, డిసెంబర్ 4: నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంతో బోధన్ పట్టణం ఆచన్‌పల్లికి చెందిన జశ్వీత్‌రెడ్డి అనే విద్యార్థి ప్రాణాలను కోల్పోయాడని ఆరోపిస్తూ ఆ విద్యార్థి కుటుంబీకులు, బంధువులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనకు ముందు జస్వీత్‌రెడ్డి తల్లిదండ్రులు, విద్యార్థి మేనమామ డయల్ 100కు కాల్‌చేసి సదరు విద్యాసంస్థలకు చెందిన ప్రతినిధులు తమ ఇంటికి వచ్చి పోలీస్ కేసును ఉపసంహరించుకోవాలని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదుచేశారు. బోధన్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు ఆ విద్యార్థి ఇంటికి వెళ్లి అక్కడ ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఎడపల్లి, డిసెంబర్ 4: మండల కేంద్రంలో గురువారం మండల స్థాయి ఉపాధి హామీ సామాజిక తణిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం వివరాలు వెల్లడిస్తుందని అన్నారు. అధికారులు, కూలీలు హాజరు కావాలని కోరారు.

7న సుబ్రహ్మణ్య షష్ఠి

సుభాష్‌నగర్,